యథేచ్ఛగా మట్టి దందా

- అక్రమంగా మట్టి తవ్వకాలు
- ట్రాక్టర్ రూ.1000లకు అమ్మకం
- అనధికార లేఅవుట్ స్థలాల్లోకి తరలింపు
- ప్రభుత్వాదాయానికి గండి
- జనసేన, టీడీపీ నాయకులే సూత్రధారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



మామిడివాడ పరిధిలో తవ్వకాలు



మామిడివాడ వద్ద స్థలంలో మట్టితో కప్పేసిన దృశ్యం

రాంబిల్లి : మట్టి బంగారంలా మారింది. మట్టికి డిమాండ్ ఏర్పడడంతో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. 15 రోజులుగా అక్రమ మట్టి దందా యథేచ్ఛగా సాగిపోతున్నా అధికారులు కనీసం పట్టించుకోలేదు. కారణం మట్టి మాఫియాలో జనసేన, టీడీపీ నాయకులు సూత్రధారులు, పాత్రదారులు కావడమే. ఈ దందాకు కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అక్రమ మట్టి తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్న సందర్భంగా రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో పాటు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ వారెవరూ కన్నెత్తి చూడడం లేదు. మామిడివాడ రెవెన్యూ పరిధిలో గల చినకలవలాపల్లి గ్రామంలో ఎకరా 70 సెంట్లు పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆయా భూమిని వ్యవసాయ భూమిగా మార్పు చేయకుండానే వందలాది ట్రాక్టర్లుతో భారీ స్థాయిలో మట్టిని వేశారు. ఇక్కడ మట్టి కుప్పలు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇదే మామిడివాడలో యలమంచిలి-గాజువాక బైపాస్‌రోడ్డును ఆనుకొని వున్న స్థలాన్ని మట్టితో నింపేసారు. పంచదార్ల రెవెన్యూ పరిధిలో రాత్రి వేళలో మట్టి మాఫియా చెలరేగిపోయి మట్టిని తరలిస్తుంది. గోకివాడ రెవెన్యూ పరిధిలో కూడా అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా



కొత్తూరు, గోకివాడ రెవెన్యూ పరిధిలో మట్టి తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్, ట్రాక్టర్లు

మట్టి తరలిస్తున్నారు. మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లే యంత్రాల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల సాయంతో లేఅవుట్లు, ఇతర స్థలా



మామిడివాడ రెవెన్యూ పరిధి చినకలవలాపల్లిలో అక్రమ లేఅవుట్ స్థలాల్లో భారీ మట్టి కుప్పలు

లకు తరలిస్తున్నారు. ట్రాక్టరు మట్టిని రూ. 1000 నుంచి రూ.1200 అమ్ముతున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా సుమారు రూ. 30 లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. అధికారుల వ్యవహార శైలి కారణంగానే మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు విషయమై చర్యలు తీసుకుంటాం. క్షేత్ర స్థాయి పరిశీలన చేసి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పోలీసు , రెవెన్యూ అధికారులతో నిఘా పెట్టిస్తాను.

– అప్పలస్వామి , తహసీల్దార్, రాంబిల్లి

క్లుప్తంగా

ముమ్మరంగా వరినారు మడులు దుక్కులు



మామిడివాడ సమీపంలో ట్రాక్టరుతో దుక్కి చేస్తున్న రైతు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వరినారు మడుల దుక్కు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మామిడివాడ, గోకివాడ, పంచదార్ల, దిమిలి, కొత్తూరు, కట్టుబోలు, రాజుకోడూరు, రజాల, కుమ్మరాపల్లి, మర్రిపాలెం, మురకాడ సహా పలు గ్రామాల్లో ట్రాక్టర్ల సాయంతో రైతులు దుక్కి పనులు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. రైతులకు వ్యవసాయశాఖ రాయితీపై వరి విత్తనాలను అందజేస్తుంది. మరో వారం పది రోజుల్లో విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు.

ఆలయభూమిలో కొబ్బరితోట వేలం రేపు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో గ్రామ దేవత ఆలయ భూమిలో కొబ్బరి తోట వేలం నిర్వహించనున్నట్టు దేవదాయశాఖ ఈవోసాంబ శివరావు తెలిపారు.పీ.ధర్మవరం తారురోడ్డును ఆనుకుని సర్వే నంబర్ 31/1లో ఎకరా 70 సెంట్లు భూమి ఉన్నట్టు చెప్పారు. ఈ మేరకు బుధవారం ఎస్.రాయవరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం రెండు గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పాటలో పాల్గొన దలిచే వారు రూ. 5000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : యలమంచిలి 33కేవీ విద్యుత్ ఉపకేంద్రం యలమంచిలి 11కేవీ రెండో ఫీడర్ పరిధిలో ఎస్ఎస్ 9 ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనుల కారణంగా సోమవారం యలమంచిలి పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ధర్మవరం, సీపీపేట, కాకివానివీధి ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ శాఖకు సహకరించాలని అయన కోరారు.

మత్స్యకార భరోసాను ప్రభుత్వం విడుదల చేయాలి



రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్

పాయకరావుపేట : ప్రతి సంవత్సరం మే నెలల్లో విడుదల చేస్తున్న మత్స్యకార భరోసాను ప్రభుత్వం విడుదల చేయాలని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేట నిషేధ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు మే నెలల్లోనే విడుదల చేసేది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే 20 వేల రూపాయలు మత్స్యకారులకు ఆర్థిక సాయం అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. వేట నిషేధ సమయం పూర్తయింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లినా సరే చేపలు దొరక్కపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల ప్రభుత్వం త్వరగా మత్స్యకార భరోసా విడుదల చేయాలన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకోసారి అమ్మవారి పండగను అత్యంత నియమ నిష్టలతో గ్రామస్తులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. సాయంత్రం పసుపు కుంకుమలతో తీన్మార్ వాయిద్యాలు, మహిళల కోలాటం నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దర్శించుకున్నారు. స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, గ్రామ పెద్దలు, ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. రాత్రికి పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

మునగపాక : అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు నిర్వహించిన స్పందన కార్యక్రమానికి బదులుగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికగా మార్చారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాపారావు కోరారు.

కంటి శిబిరంలో 337 మందికి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 128వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 337 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 223 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 67 మందికి మందులు అందజేశారు. 46 మంది కాటరాక్ట్ సర్జరీ చేసుకోవాలని సూచించారు. ఉచిత కంటి శిబిరానికి విచ్చేసిన వారితో బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి ఆధ్వర్యంలో మజ్జిగ, భోజనం, ఫలహారం ఏర్పాటు చేశారు.

గురు శిష్యుల బంధం చాలా గొప్పది..

కోటవురట్ల : ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. పందూరు గ్రామంలో జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మను సంపూర్ణంగా దర్శించగలిగినపుడే శిష్యుడు గురుత్వాన్ని పొందగలడని అన్నారు. సృష్టిలో గురుశిష్యుల బంధం చాలా గొప్పదని తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవాలని, అందులో ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని తెలిపారు. త్రిమత గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, స్వామినాయుడు, ఆదిత్య పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

21 రోజుల పాటు ధ్యానంపై అవగాహన

మునగపాక : మండలంలోని నాగులాపల్లి చంద్రశేఖర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈ నెల 24నుంచి జూలై 14 వరకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని సీనియర్ పిరమిడ్ టీచర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 21 రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి 8.30 గంటల నుంచి 9.45 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ధ్యానంతో ఆరోగ్యం అలాగే ఎదుగుదలపై అవగాహన, స్పష్టతతో అద్భుతంగా జీవించడానికి చిట్కాలు, పరివర్తనాత్మక ధ్యాన ప్రయాణం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సుజాత కోరుతున్నారు.

భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలి

మునగపాక : చదువుతో పాటు అన్ని రంగాలపైనా అవగాహన పెంచుకోవాలని భగవద్గీత బోధకులు భీశెట్టి లక్ష్మి కోరారు. మంగళవరపుపేటలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాలు వాటి అర్థాలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను మాట్లాడుతూ గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రాయింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, కోశాధికారి ఆడారి అప్పలనాయుడు, డైరెక్టర్లు సునీత, తులసి, అనురాధ కార్యక్రమంలో పాల్గొన్నారు.



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

మునగపాక : జాతీయవాది స్వర్గీయ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఆదివారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్‌మోర్చా జోనల్ ఇన్‌చార్జి బత్తిన సాయిరాం మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు అమోఘమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జనసంఘ్‌ను స్థాపించి దేశంలోనే తొలి హిందూ సమాజ రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా గుర్తింపు పొందారన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ మళ్ల కాలేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కర్, మండల ఉపాధ్యక్షుడు మళ్ల మల్లయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి సంపర భార్గవాచార్యులు, పార్టీ నేతలు గరివినాయుడు, వరలక్ష్మి, గణేష్, తేజస్వి, శ్రీరాములు పాల్గొన్నారు.



మునగపాకలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అడ్డురోడ్డులో మానవత స్వచ్ఛంద సంస్థ నూతన శాఖ

ఎస్.రాయవరం : ఉత్తమ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గాజువాక అధ్యక్షుడు ఎంపీ సుబ్బరాజు అన్నారు. పెదగుమ్ములూరు గ్రామంలో అడ్డురోడ్డు మానవత స్వచ్ఛందశాఖ ఏర్పాటుకు పలువురు వ్యాపారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఆదివారం సమావేశం అయ్యారు. త్వరలో అడ్డురోడ్డులో నూతన శాఖ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ స్వచ్ఛంద సంస్థలో మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, రక్తం గ్రూపులు నిర్ధారణ చేసి జాబితాను సిద్ధం చేయడం, అంబులెన్స్ సేవలు, ఉచిత వైద్యశిబిరాలు, మార్చురీ ఫ్రీజర్లు, శాంతి ర్యాలీలు నిర్వహణ వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యేజర్ల పెరుమాళ్లరాజు, మాజీ సర్పంచ్‌లు పుట్టా సుధాకర్, ఎస్.వి.ఎస్ మధువర్మ, అడ్డురోడ్డు వర్తక సంఘ నాయకులు చంద్రశేఖర్‌రావు, రామ్‌కోటి, చంటిరాజు, సాగి పాండురంగవర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం అయిన మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

సుందరపు విజయోత్సవ ర్యాలీ

రాంబిల్లి: ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ విజయోత్సవ ర్యాలీ ఆదివారం రాంబిల్లి మండల పరిధిలో నారాయణపురం, మామిడివాడ, కొత్తూరు, పంచదార్ల, హరిపురం, వెంకటాపురం గ్రామాల్లో జరిగింది. యలమంచిలి-గాజువాక బైపాస్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత సుందరపు సతీష్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అమ్మవారి మహోత్సవం కావటంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు చైర్మన్ పి.పెంటారావు, కార్యదర్శి ఒ.మధు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రైతన్నకు తోడ్పాటు అందించాలి



రైతులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ఆహారాన్ని పండించే రైతును ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని జేడీ ఫౌండేషన్ సభ్యులు దూలపల్లి నాగేశ్వరరావు అన్నారు. కర్రివానిపాలెం గ్రామంలో ఆదివారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలువురు రైతులను సత్కరించి రైతు ఆశయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకి సహచరులు తోడ్పాటునిచ్చి పండించే పంటల్లో ఎరువులు, పురుగు మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 12 మంది రైతులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పోతు గోవిందరావు, పినపాత్రుని వెంకటరమణ, వీర వెంకట సత్యనారాయణ, అచ్చియ్యదొర, మోహన్‌రావు, గొర్లి రాము, శ్రీను పులి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

యలమంచిలి రూరల్ : శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా యలమంచిలి వచ్చిన సుందరపు విజయ్‌కుమార్‌కు ఆదివారం ఘనస్వాగతం లభించింది. ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి యలమంచిలి పట్టణం మీదుగా అచ్యుతాపురం వెళ్లారు. పలువురు జనసేన,టీడీపీ నాయకులు,మహిళలు సుందరపు విజయ్‌కుమార్‌ను పూలమాలలతో సత్కరించారు. పోతురెడ్డిపాలెం హైవే కూడలి వద్ద గ్రామ సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. జనసేన ఉత్తరాంధ్ర పరిశీలకుడు సతీష్, టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూగ బోయిన బీఎస్ఎన్ఎల్ సిగ్నళ్లు

16 గ్రామాల వినియోగదారులకు ఇక్కట్లు

నాతవరం: మండలంలోని సరుగుడు గ్రామంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి సిగ్నళ్లు రాక పోవడంతో మూడు రోజులుగా ఈ ప్రాంత వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సెల్ టవర్ ఆధారంగా సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో 16 గ్రామాల వినియోగదారులు ఫోన్లు వాడుతున్నారు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ తప్ప ఇతర నెట్‌వర్క్‌లు లేవు. సరుగుడు గ్రామ సచివాలయంలో ప్రజలకు ఆన్‌లైన్ సేవలందించాలన్నా ఇదే దిక్కు. సెల్ సిగ్నళ్లు లేక ప్రైవేట్ వ్యాపారులు, ఉపాధి కూలీలు సైతం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా ప్రజలకు వచ్చే వివిధ పథకాలు డబ్బులు సరుగుడులోని మినీ బ్యాంక్ ద్వారా తీసుకుంటున్నారు. సెల్ టవర్ పని చేయక ఈ లావాదేవీలు కూడా నిలిచిపోతున్నాయి. ఏ కొద్దిపాటి వర్షం పడినా, ఈదురు గాలులు వీచినా టవర్ నుంచి సిగ్నళ్లు నిలిచిపోతాయని స్థానికులు చెప్తున్నారు. ఇటీవల కాలంలో ఈ సమస్య తరచూ ఏర్పడుతోందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



సరుగుడులో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

అప్రమత్తతే శ్రీరామరక్ష

- సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన తప్పనిసరి
- మండలంలో 10 మంది వ్యాధిగ్రస్తులు
- రోగులకు నెలకు రూ.10 వేలు పింఛన్ అందజేత

అనకాపల్లి : సికిల్ సెల్ ఎనీమియా అనేది అంటు వ్యాధి కాదు. వ్యాధి సోకిన రోగి శరీరంలో రక్త శాతం రోజురోజుకు తగ్గిపోతుంది. ముందుగా వ్యాధిని గుర్తించినట్లయితే ప్రత్యేక చర్యల ద్వారా వ్యాధి సోకిన వ్యక్తిని కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వారి శరీరంలో అన్ని అవయవాలు దశలవారీగా వివిధ రుగ్మతల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. భారతదేశంలోని 17 రాష్ట్రాల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. మండలంలో 10 మంది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నారు. వ్యాధి సోకిన వ్యక్తికి రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



బల్లపూడిలో అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ఈ ఏడాది జూన్ 19 నుంచి జూలై 3వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాయి. మండలంలో తుమ్మపాల, తగరంపూడి, పట్టణ పరిధిలో వ్యాధిపై రోజుకొక ప్రాంతంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.
- కొన్ని సమయాల్లో వ్యాధి సోకిన వ్యక్తికి నెలకు రెండు సార్లు రక్తం మార్చాల్సి ఉంటుంది.
- ఈ వ్యాధి సోకినట్లయితే రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా మారతాయి. దీంతో శరీర భాగాలకు సరైన రీతిలో రక్త సరఫరా జరగదు. అటువంటి సమయంలో అవయవాలు దెబ్బతినే పరిస్థితి ఎదురవుతుంది.
- సాధారణ రక్తకణాలతో పోలిస్తే సికిల్ సెల్ (కొడవలి కణాలు)కణాలు దృఢంగా ఉంటాయి. అటువంటి కణాల బిగుతు, అసాధారణ ఆకారం శరీరంలోని చిన్న రక్తనాళాల ద్వారా కదిలే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. రక్త ప్రవాహంలో

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు

1. రక్త కణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత)
2. కళ్లు పసుపు రంగులోకి మారడం
3. తీవ్రమైన ఒంటి, కీళ్ల నొప్పులు
4. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
5. అలసట
6. తరచుగా వచ్చే అంటువ్యాధులు
7. గర్భధారణ సమయంలో సమస్యలు
8. అవయవ నష్టం

26న గురుకుల మిగులు సీట్ల కోసం రాత పరీక్ష

గొలుగొండ: స్థానిక బాలుర గురుకుల కళాశాల లో మిగులు సీట్ల కోసం విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడా రు. 6,7,8,9వ తరగతులలో మిగులు సీట్లు ఉన్నందున ఈ నెల 26న కళాశాలలో ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేటగిరీల